అందుకు రెండో మిత్రుడు నవ్వి చెప్పాడు.

"నేనూ భగవంతుడికి పూలని సమర్పించాను."

"అబద్ధం చెప్పక. నేను చూడలేదా?"

"నేను అర్పించింది అహింసా పుష్పాలు. పూలని చెట్లనించి తెంపటం వల్ల ఆ చెట్లకి బాధ కలుగుతుంది. ఆ హింస చేయకుండా వుండడం ద్వారా నేను దేవుడికి అహింసా పుష్పాలు సమర్పించాను." వివరించాడు రెండో మిత్రుడు.

## 9. దేవుడు ఏం చేస్తాడు?

దేవుడ్ని నమ్మని ఓ నాస్తికుడు ఓ తాత్త్వికుడితో వాదిస్తున్నాడు.

"ఏమిటి దేవుడు? నా చదువు నేను చదివాను. నా ఉద్యోగం నేను సంపాదించుకున్నాను. నా పెళ్ళి నేను చేసుకున్నాను. నా ఇల్లు నేను కట్టుకున్నాను. నా పిల్లలు నా వల్ల పుట్టారు. నా చావు నేను చస్తాను. నాది ప్రతీది నేనే చేసుకున్నాను. ఆయన నాకు చేసింది ఏమిటి? ఇంక దేవుడి మీద నేనెందుకు ఆధారపడాలి?"

"ఒక్కటి తప్ప." నవ్వాడు తాత్త్వికుడు.

"ఏమిటది?"

"నీ దేహం. నీ దేహాన్ని నువ్వు కావాలనుకుని నీ అంతట నువ్వే స్వయంగా తయారుచేసుకున్నావా?"

"...."

"అరవై లక్షల కోట్ల కణాలు గల నీ దేహాన్ని నువ్వు చేసుకోలేదు. దాన్ని చేసిన వాడి పేరే దేవుడు. దాన్లో నిన్ను నింపినవాడి పేరూ దేవుడే. రేపు దాన్లోంచి నిన్ను తీసి పారేసేవాడే దేవుడు. వీటిలో దేనిమీదా నీకు అధికృత లేదు." చెప్పాడు తాత్త్వికుడు.